క్లుప్తంగా

వైభవంగా మహాపుష్పాభిషేకం



స్వామివారికి పుష్పాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: శ్రీరామ నవమి సందర్భంగా ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామివారి 76వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తులకు తీరొక్కపూలతో వైభవంగా మహాపుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు తులసిపూజ, గోపూజ వంటివి చేశారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అనుబంధ కిరాణ జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వేడుకల నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వజ్రపు మోహన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం గాంధీచౌక్ వరప్రధాత శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం బాబా విష్ణు మహిళా భక్త బృందం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

డిప్యూటీ స్పీకర్‌కు రామయ్య తలంబ్రాలు, ప్రసాదం



పద్మారావుగౌడ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నగేష్ తదితరులు

తిరుమలాయపాలెం : ఇటీవల భద్రాచలంలో జరిగిన శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణంలో వినియోగించిన తలంబ్రాలు, రామయ్య ప్రసాదాన్ని బీఆర్‌ఎస్ మండల నాయకుడుజడల నగేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు అందజేశారు. హైదరాబాద్‌లోని పద్మారావు నివాసంలో ఆయనను కలిసి తలంబ్రాలు, ప్రసాదం, జ్ఞాపిక అందజేశాక శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బి.సైదులు, నాగరాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బలవర్ధక బియ్యం పంపిణీ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు బలవర్ధకమైన బియ్యం(పోర్టిఫైడ్ రైస్)ను ఈ నెల నుంచి పంపిణీ చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 745 రేషన్ దుకాణాల్లో 4,12,092 కార్డులకు గాను 11.37 లక్షల మంది లబ్ధిదారులకు పోషక ఆహారం అందనున్నదన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ బియ్యం అందించబడుతుందని పేర్కొన్నారు.

వ్యక్తి సంస్కరణే ఉపవాస లక్ష్యం

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ.. అన్నం, పానీయాలకు దూరంగా ఉండటంతో పాటు సమస్త చెడుల నుంచి దూరమైనప్పుడే రోజా లక్ష్యం నెరవేరుతుందని జమాతె ఇస్లామి హింద్ ఖిల్లా అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఆదివారం ఖమ్మం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపవాసం పాటించినప్పుడే మనిషిలో దైవ భీతి, నిగ్రహ శక్తి, సహనం పెరగటంతో పాటు మనిషికి ఆకలి బాధ తెలుస్తుందన్నారు. దివ్య ఖురాన్ బోధనలు మానవాళికి ఇహంతో పాటు పరంలోనూ దారి చూపుతాయని వెల్లడించారు. ఖురాన్ గ్రంథం రంజాన్ మాసంలో అవతరించిందని, అందుకే రంజాన్‌కు అంత ప్రాముఖ్యత ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహెమూద్, ఫరీఫ్, ఇలియాస్, అబ్దుల్ మల్లిక్, రజాక్, ఖాసీం, అజీజ్, ఫయాజ్, ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	36		10
కాకర	40	చుక్కకూర	2
సోర	16		10
బీర	56	తోటకూర	2
దొండ	36		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	56		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	28		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

సమస్యలతో సహవాసం..!

అభివృద్ధికి నోచుకోని ఐదు పంచాయతీలు

- పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే వారే లేరు
- ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజల పాట్లు
- అందుబాటులో ఉండని అధికారులు
- పట్టించుకోని పాలకులు

ఖమ్మంరూరల్: గత కొంతకాలం క్రితం ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనం చేసిన ఐదు పంచాయతీలను తిరిగి ప్రభుత్వం గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి రెండేళ్లయింది. ఖమ్మం రూరల్ మండలంలోని పెదతండా, వెంకటగిరి, గుర్రాలపాడు, ఏదులాపురం, గుదిమళ్ల గ్రామ పంచాయతీలను గత రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనం చేసింది. ఏ ప్రయోజనం ఆశించి అప్పట్లో ఈ ఐదు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలిపారో కానీ అప్పటి నుంచి విలీనాన్ని ఈ గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడితోనే ప్రభుత్వం విలీన పంచాయతీలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది.

కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు..

పంచాయతీలుగా మారిన గ్రామాల్లో వెంటనే ఎన్నికలు నిర్వహించడానికి వీలులేకపోవడంతో ప్రభుత్వం అప్పటి వరకు ఒక్కో పంచాయతీకి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించింది. వారు పంచాయతీలకు సంబంధించిన రికార్డులను కార్పొరేషన్ అధికారుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అయితే ప్రత్యేకాధికారులకు పంచాయతీల విధులతో పాటు ఇతర పనులు ఉండడంతో వారు ఇటు వైపు కన్నెత్తి చూడలేదు.

కుంటుపడిన పాలన..

పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారుల ద్వారా ఆయా పంచాయతీల పాలన కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కనీసం సైడు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించే నాథుడే లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అలా అని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు చెబుదామంటే సంబంధిత ప్రత్యేకాధికారులు





వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ప్రధాన రహదారి పక్కన చేరిన మురుగునీరు(ఇన్‌సెట్) పెదతండాలోని సైడ్‌కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎవరూ అందుబాటులో ఉండటంలేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం గ్రామ పంచాయతీకి సర్పంచ్ ఉంటే తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేవారమని, ఒకవేళ సర్పంచ్ పనిచేయకుంటే నిలదీసైనా పని చేయించుకునే హక్కు తమకు ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు. సర్పంచ్ లేకపోవడంతో గత ఏడాదిన్నర కాలంగా కార్పొరేషన్ పరిధిలో ఉండి అభివృద్ధికి నోచుకోక నరకం అనుభవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కరించాల్సిన సమస్యలు ఇవే..

- శుద్ధమైన తాగునీటి సరఫరా చేయాలి.
- చేతి పంపులకు మరమ్మతులు చేయించాలి.
- సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలి.
- వెలగని వీధిలైట్లను అమర్చాలి.
- పెండింగ్‌లో ఉన్న పంచాయతీ సిబ్బంది వేతనాలపై దృష్టి సారించాలి.
- వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లాలి.
- ఉపాధి హామీ పథకం కింద కూలీలకు సరిపడా జాబ్‌కార్డులు మంజూరు చేసి, పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి.

కుక్కల బెడద ఉంది..



గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా వీధుల వెంబడి కుక్కలు ఉండడంతో బయట రావాలంటేనే భయంగా ఉంటుంది. ఇప్పటికి గ్రామంలో అయిదారుగురిని కుక్కలు కరిచాయి. ఈ విషయమై అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– చల్లా హనుమంతు, గుదిమళ్ల

సమస్యలు పరిష్కరిస్తాం..

పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గం చూపుతాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రయత్నిస్తాం. ఇప్పటికే సైడ్ డ్రెయిన్లలో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేయిస్తున్నాం.

– అశోక్‌కుమార్, ఎంపీడీఓ, ఏదులాపురం గ్రామ ప్రత్యేకాధికారి

పేపర్ లీకేజీలపై విచారణ జరపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రఘునాథపాలెం: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే బోర్డు చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలని, సీఎం కేసీఆర్ స్పందించి నష్టపోయిన నిరుద్యోగులను ఆదుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ డిమాండ్ చేశాడు. ఆదివారం పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని కామంచికల్ గ్రామంలో యువతతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్షల రూపాయాలు ఖర్చు చేసి చాలా ఏళ్ల నుంచికష్టపడి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు జీవితాలు ఇలా పేపర్ లీకేజీలు అవుతుంటే ఏమైపోవాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై సిట్ ఏర్పాటు చేసి మాకేం సంబంధం లేనట్టుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే సీఎం స్పందించి జరిగిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్షుడు వంశీ, నాయకులు ఉదయ్, ముస్తఫా, నరేష్, సురేష్, సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

క్రీడలను విస్మరిస్తున్న ప్రభుత్వం..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: గ్రామీణ క్రీడల పట్ల తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సుర్దేపల్లిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కబడ్డీ ఆడి, క్రీడాకారులను ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోళ్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, సూరేపల్లి రవి, యాతాకుల శ్రీనాథ్, చిట్టా సైదిరెడ్డి, యడవల్లి నాగరాజు, పి.సుదర్శన్, డి.సంతోష్, వీరబాబు, లక్ష్మీనారాయణ, గురవయ్య, మహిత్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే 'సంక్షేమం'..

తిరుమలాయపాలెం: ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపింది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని ఏనెకుంటతండాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడప గడపకు వెళ్లి రాహుల్‌గాంధీ సందేశ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి ఇజ్రాయిల్, బచ్చోడు ఎంపీటీసి పాప్యా నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో మమత రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులుఅత్యుత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు బృందంగా ఏర్పడి మిషన్ జియోపెట్రా అనే నమూనాను రూపొందించి తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. పాఠశాల డీజీఎం చేతన్ మాథూర్, ప్రిన్సిపాల్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, సురేష్, డీన్స్ కేవీఆర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దామోదరరెడ్డిని కలిసిన 'ఐఆర్‌ఎస్'

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన దామోదరరెడ్డిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(ఐఆర్‌ఎస్) అధ్యక్షుడు డాక్టర్ చంద్రమోహన్, వైస్ చైర్మన్, రిటైర్డు తహసీల్దార్ ఆర్.రవీందర్‌రావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాదినేని జనార్దన్‌రావు, సత్యనారాయణరెడ్డి, జిల్లా వెంకటేశ్వర్లు గోవర్ధన్, శ్రీహరి, వీరభద్రం, నరసయ్య, బానోతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎస్ ఆదేశాలు హర్షణీయం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాయుధపోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల పలు సందర్భాలలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తేసుకొచ్చారని,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఇచ్చిన ఆదేశాలలో ఏప్రిల్ 3న జయంతిని, జులై 4న వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని సంబంధిత శాఖలకు ఉత్తర్వులివ్వటం హర్షణీయమని నున్నా పేర్కొన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కూడా అధికారికంగా జరపాలని ట్యాంక్‌బండ్‌పై కొమరయ్య, ఐలమ్మల విగ్రహాలు పెట్టాలని నున్నా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: హక్కుల సాధన కోసం ఈ నెల 5న చేపట్టిన చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని సీటు జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీటు జనరల్ బాడీ సమావేశంలో చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో 29 చట్టాలను రద్దు చేసి, నాలుగు చట్టాలుగా చేశారని ఆరోపించారు. ఇంకా ఉపాధి హామీ పథకం, రైతులకు మద్దతు ధర, విద్యుత్ సాధన తదితర చట్టాలను తొలగించేందుకు దుర్మార్గమైన కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీటు నాయకులు చెరుకు శ్రీను, సీహెచ్.నాగయ్య, తిరపయ్య, కనకరావు, మహేష్, వెంకటేశ్వర్లు, సురేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ నిరసన

ఖమ్మం సహకారనగర్: వీఆర్‌ఏలకు పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వీఆర్‌ఏ లింగరాజు ఫ్లెక్సీ ప్రదర్శించి తన నిరసనను వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ గ్రౌండ్‌లో ఎస్ఆర్‌హెచ్-ఆర్ఆర్ ఐపీఎల్ ట్వంటీ 20 క్రికెట్ మ్యాచ్ జరుగగా అతడు తన నిరసనను ఫ్లెక్సీ ద్వారా వ్యక్తం చేశాడు.

అంగన్‌వాడీలను అవమానపర్చడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల విడుదలైన దసరా సినిమాలో దర్శకుడు శ్రీకాంత్ ఓడెల అంగన్‌వాడీ టీచర్ ఎవరూ చూడకుండా కోడిగుడ్లు, బియ్యాన్ని దొంగతనంగా తీసుకెళ్తున్నట్లుగా చిత్రీకరించడం తగదని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీహెచ్.సీతామహాలక్ష్మి తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో నాలుగు దశాబ్దాలుగా మాతా, శిశు సంరక్షణకు, వెనకబడిన ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరి చేస్తున్న స్వచ్ఛంద సేవకులను అవమానించే విధంగా సినిమాలో సన్నివేశాన్ని చిత్రీకరించాని, వాటిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలను సమీకరించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ సన్నివేశాల పట్ల రాష్ట్ర స్థాయి ఐసీడీఎస్ రాష్ట్ర అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా నాయకులు లక్ష్మీమణి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



రఘునాథపాలెం: ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

ఖమ్మంగాంధీచౌక్/రఘునాథపాలెం: ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెంలోని చర్చిల వద్ద క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏసయ్య యేరూషలేమ్‌లో ఓ రక్షకునిగా, ఓ రారాజుగా అడుగుపెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని హోలీ వీక్ కార్యక్రమాలను జరుపుకుంటారు. దీనిలో భాగంగా గుడ్ ఫ్రైడేకి ముందు జరుపుకునే పండుగ మట్టల ఆదివారంను జరుపుకున్నారు. ఏసుక్రీస్తుకు ఖర్జూర మట్టలు, ఈత, కొబ్బరి మట్టలను పూలతో అలంకరించి, చేతిలో పట్టుకొని పాటలు పాడుతూ, ప్రార్థనలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బీసీలంతా సంఘటితం కావాలి



మాట్లాడుతున్న పాల్వంచ రామారావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలంతా సంఘటితం కావాలని బీసీ జేఏసీ చైర్మన్ పాల్వంచ రామారావు కోరారు. ఆదివారం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా నుంచి ఒక్క ప్రజాప్రతినిధి లేకపోవటం దారుణమన్నారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి 55 శాతం ఉన్న బీసీలకు ఇప్పటి వరకు ఖమ్మం లేదా పాలేరులో సీటు ఇవ్వకపోవటం అన్యాయమని తెలిపారు. ఈ సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల పరామర్శలు



వినయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీలు నామ, వద్దిరాజు, బండి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్ సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఖమ్మం మోతీనగర్‌కు చెందిన గొరిశెట్టి వినయ్ ఇటీవల మృతి చెందగా.. రాజ్యసభ ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రలతో కలసి వినయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం ఖమ్మం మమత ఆస్పత్రి రోడ్డులోని కొల్లి శ్రీధర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ, కొల్లి వెంకటేశ్వర్లు, మోరంపుడి ప్రసాద్, జిల్లా టెలికాం సలహా మండలి సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, నామ సేవా సమితి నాయకులు పాల్వంచ రాజేష్, కృష్ణ ప్రసాద్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలోని దానవాయిగూడెంలో చామకూరి నవిత(25) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా.. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పీఏ నంద్యాల రవీందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించాక పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

గుండెపోటుతో ఇద్దరు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెంకు చెందిన ఏపూరి సతీష్(30) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృత్యువాత పడ్డారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని సీపీఎం నాయకులు బి.రమేష్, నండ్ర ప్రసాద్, ఏపూరి వరకుమార్, అచ్యుతరావు, నాగేశ్వరరావు, టి. సుధాకర్, మల్లికార్జున్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పిండిప్రోలులో ప్రజాపంథా నాయకుడు..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సీనియర్ నాయకుడు పప్పుల వెంకన్న (58) గుండెపోటుతో మృతిచెందాడు. ఆదివారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం మమతా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడుకి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకన్న మృతి పట్ల పార్టీ మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్‌పీఎల్ విజేత 'పువ్వాడఉదయ్‌నగర్'

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో బ్లూస్టార్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ పోటీలు గత 10 రోజులుగా కొనసాగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రఘునాథపాలెం మండలం పువ్వాడఉదయ్‌నగర్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా.. ద్వితీయ బహుమతి కారేపల్లి మండలం, తృతీయ బహుమతి ఖమ్మం నగర జట్టులు దక్కించుకున్నారు. రఘునాథపాలెం ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) క్రికెట్ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.75 వేలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, ద్వితీయ బహుమతి రూ.50వేలు బానోత్ ప్రవీణ్‌కుమార్, తృతీయ బహుమతి రూ.25వేలు ముద్రబోయిన వెంకటేశ్వర్లు అందించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత కార్యదర్శి చిరుమామిళ్ల రవికిరణ్, టీఆర్‌ఎస్ నాయకులు గుడిపుడి రామారావు, మందా వెంకటయ్య, గుగులోత్ లక్ష్మణుడు, బచావత్ మంగు, హరికృష్ణ, నిర్వాహకులు వాంకుడోత్ రవి, తులిశ్యా, బొడా రామకృష్ణ, బాలా, మొగిలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పువ్వాడఉదయ్‌నగర్ జట్టుకు షీల్డ్, నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం



ద్వితీయ బహుమతి పొందిన కారేపల్లి జట్టు

అటెన్షన్ ప్లీజ్

చెరుకు గడ..!



మండలంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీకి వచ్చే చెరుకు వాహనాలతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అమ్మగూడెం ఫ్యాక్టరీ వద్ద వాహనాలు ఒక్కసారిగా రావటంతో రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి. చెరుకు ట్రాక్టర్లు లోడ్లు రహదారిని చాలా ఆక్రమించటంతో ప్రయాణికులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫ్యాక్టరీ వద్ద యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

- నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోటయ్య, ఫ్యాక్టరీ సీజీఎం, మధుకాన్
సెల్ నంబర్ : 96765 55501